క్లుప్తంగా

స్పై లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: ప్రజలు స్పై లింక్‌ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. కొంతమంది తెలియక కొన్ని లింక్‌లను ఓపెన్ చేయడం ద్వారా తమ ఖాతాల్లోని నగదు మాయమవుతున్నట్టు గుర్తించుకోవాలన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది యాప్‌ల పేరిట మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని బ్యాంక్ ఖాతాల్లోని నగదును తేలికగా తస్కరిస్తున్నారన్నారు. కొత్తగా లింక్‌లను పంపడం, వాటిని మనం ఓపెన్ చేయగానే హ్యాకర్ల చేతుల్లోకి మన ఫోన్ నంబరు వెళ్లిపోతుందని, తద్వారా డబ్బులను తేలికగా డ్రా చేసుకునే మోసాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్ ఖాతాలకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు.

వాడ్రాపల్లిలో తహసీల్దార్ పర్యటన

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం సాయంత్రం తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు పర్యటించారు. ఇక్కడ ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదం నేపథ్యంలో సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. ఇరు వర్గాలకు చెందిన రికార్డులు తీసుకురావాలని ఆయన ఆదేశించారు.

క్రికెట్‌లో రాణించాలి



పోలీస్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న దృశ్యం

అచ్యుతాపురం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం సీఐ గణేష్ విద్యార్థులకు క్రికెట్‌పై అవగాహన కల్పించారు. పోలీస్ గ్రౌండ్‌లో వారితో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. క్రికెట్‌లో రాణించి మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆటల్లో రాణిస్తూనే చదువులో మాత్రం ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు

మునగపాక: స్థానిక మెయిన్ రోడ్డులో మంగళవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ రామకృష్ణ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలిచ్చినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లే ఆటో డ్రైవర్లపై చర్యలు తప్పవన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చిట్టి పైడితల్లమ్మ జాతర



చిట్టి పైడితల్లమ్మను దర్శించుకున్న నాయకులు, గ్రామ పెద్దలు

అచ్యుతాపురం రూరల్: దుప్పితూరులో చిట్టి పైడితల్లమ్మ జాతర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బారీ బాణసంచా, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగింపు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న లోవరాజు

ఎస్.రాయవరం: బాల్య వివాహాలు నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల సంరక్షణ ప్రతినిధి డి. లోవరాజు తెలిపారు. మంగళవారం గెద్దపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు వివాహాలు చేయడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాలల హక్కులు భంగం కలగకుండా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జబ్బవాపు.. జాగ్రత్త

- వ్యాధితో అప్రమత్తత అవసరం
- నివారణ టీకాలు వేయించాలి



పాడి పశువు

కోటవురట్ల: రైతుకు వ్యవసాయం, పాడి రెండు కళ్లలాంటివి. వ్యవసాయం చేస్తూ పాడి పశువును పోషించుకోవడం ద్వారా రైతు కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయి. ఎంతో పెట్టుబడి పెట్టి రేయింబవళ్లు శ్రమించి చేసిన వ్యవసాయం ఒక్కొక్కసారి నష్టాల్లో ముంచేయవచ్చు. కానీ పాడి మాత్రం రైతును ఓ పెద్దన్నలా ఆదుకుంటుందనే చెప్పాలి. ఎక్కువ శాతం రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పోషణను చేపడుతున్నారు. దాంతో పశుపోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పశు పోషణ విధానం, వ్యాధులు, నివారణ పట్ల ప్రతీ పాడి రైతు అవగాహన కలిగి ఉండాలి. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడమే కాకుండా ముందస్తుగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. పశువుల్లో సీజనల్‌గా అనేక వ్యాధులు వస్తుంటాయి. అందులో ప్రధానంగా జబ్బవాపు వ్యాధి ప్రమాదకరమనే చెప్పాలి. ముందుగా నివారణ చర్యలు తీసుకుంటే నష్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. వ్యాధి లక్షణాలు కనిపించగానే పశువైద్యుని సంప్రదించి తగు చికిత్స చేయించాలి.

జబ్బవాపు వ్యాధి..

ఈ వ్యాధి తొలకరి చినుకులు పడగానే తన ఉనికిని చాటుకుంటుంది. సాధారణంగా ఆరోగ్యంగా, బలంగా ఉన్న పశువులకు వ్యాధి సోకుతుంది. ఉష్ణ ప్రాంతాలు, గాల్లో తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తొందరగా వ్యాప్తి చెందుతుంది. ఓ రకమైన సూక్ష్మజీవి ద్వారా ఈ వ్యాధి సంక్రమించి నష్టాన్ని కలగజేస్తుంది. అంతే కాకుండా కలుషితమైన నీరు, ఆహారం ద్వారా కూడా తొందరగా వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు..

ఈ వ్యాధి 6 నెలల నుంచి 2 ఏళ్లు వయసున్న పశువుకు సంక్రమిస్తుంది. వ్యాధి సోకితే పశువు తొడ కండరాలు, జబ్బపై వాపు కనిపిస్తుంది. వాపు ఉన్న చోట వేడిగా ఉండి పశువు నొప్పితో విలవిల్లాడుతుంది. ముందు కాళ్ల మధ్య కూడా వాపు వచ్చే అవకాశం ఉంటుంది. వాపు ఉన్నచోట తాకితే కరకరమన్న శబ్దం వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో ఆకలి మందగించి నీరసించిపోతాయి. సకాలంలో గుర్తించకపోతే జ్వర తీవ్రత 104 నుండి 106 డిగ్రీలకు పెరిగి పశువు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన చిన్న పశువులు అకస్మాత్తుగా మరణిస్తాయి. ఎక్కువ శాతం రైతులు ఈ వ్యాధిని గమనించక ముందే పశువులు చనిపోతాయి. ఒకటి కంటే ఎక్కువ శరీర భాగాల్లో వాపు కనిపిస్తే పశువు 12 నుంచి 36 గంటల్లోగా చనిపోతుంది. సాధ్యమైనంత వరకు రైతులు నిత్యం పశువులను గమనిస్తూ ఉండాలి. సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశువులను గుర్తించిన వెంటనే మిగతా పశువులకు దూరంగా ఉంచి చికిత్స చేయించాలి.

ముందుగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలి..



వర్షాలకు ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించగానే పశువైద్యుని సంప్రదించాలి. వ్యాధి సోకిన పశువుకు పెన్సిలిన్, ఇతర యాంటీబయోటిక్ మందులు వేయాలి. వ్యాధి సోకిన పశువులను మిగతా పశువుల నుంచి వేరు చేయాలి. వ్యాధి వచ్చిన పశువు మలమూత్రాలతో పాటు గడ్డిని కాల్చి వేయాలి. చనిపోయిన పశువును సున్నపు గోతిలో వేసి పూడ్చివేయాలి.

– డాక్టరు పెట్ల సరేష్, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, కోటవురట్ల

హామీలను విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత బ్రహ్మాజీ

మునగపాక: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సీఐటీయూ నేత ఎస్.బ్రహ్మాజీ విమర్శించారు. మంగళవారం మునగపాకలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌ను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్మికుల హక్కులను ప్రభుత్వాలు హరింపజేయడం విచారకరమన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదన్నారు. వారికి పనిభారం పెరుగుతుందే తప్ప వేతనాలు పెంచడం లేదన్నారు. ఉపాధి కూలీలకు వారాల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వరపు పార్వతి, ప్రజా నాట్య మండలి నాయకులు సంజీవరావు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

అచ్యుతాపురం రూరల్: లేబర్ కోడ్స్ అమలు చేస్తే, కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన తెలియజేసే అవకాశం కోల్పోతారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు తెలిపారు. మంగళవారం అచ్యుతాపురం కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నూతన రోడ్డు రవాణా చట్టం రద్దు చేయాలని, ఎస్ఈజెడ్ ఫార్మా పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలని, ప్రమాదాలు అరికట్టాలని, కార్మికులకు భద్రత పరికరా, ఇవ్వాలని, పరిశ్రమల్లో భద్రత ఆడిట్ చేయాలని డిమాండ్ చేశారు. నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కర్రి నాయుడు, తట్టా రాజు, ముఠా కార్మికులు, ఎస్ఈజెడ్ కార్మికులు పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

పారిశుధ్య కార్మికుల నిరసన



మున్సిపల్ గ్యారేజ్ వద్ద నిరసన తెలియజేస్తున్న పారిశుధ్య కార్మికులు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు స్థానిక మున్సిపల్ గ్యారేజ్ వద్ద నిరసన తెలియజేశారు. రాష్ట్ర ఏఐటీయూసీ కమిటీ పిలుపుమేరకు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు వై నూకరాజు, సీహెచ్ వెంకటరమణ, జే వెంకటరమణ, వై దుర్గారావు, వై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకుడు శివాజీ

యలమంచిలి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు. మంగళవారం యలమంచిలి దిమిలి రోడ్డు కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసే నిర్ణయాన్ని విరమించుకోవాలని నిరసనకారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జానకి, వరలక్ష్మి, కొండయ్య, జ్యోతి, మణి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 30 మంది ఎంపిక



వాడ్రాపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. రామాలయం ఆవరణలో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి 86 మంది రోగులు హాజరుకాగా, వారిలో 30 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి ప్రత్యేక బస్సులో విశాఖకు తరలించారు. తొలుత ఈ శిబిరాన్ని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు సందర్శించారు. ప్రతి ఒక్కరూ కంటి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతీ ఆర్నెల్లకు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్యాంపు కో–ఆర్డినేటర్ సతీష్, బొడ్డేడ సత్యనారాయణ, పూసర్ల రాజా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా తలుపులమ్మతల్లి పండగ



తలుపులమ్మతల్లి అమ్మవారు



తంగేడు కాటా వద్ద అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

కోటవురట్ల: తంగేడు గ్రామంలో తలుపులమ్మతల్లి పండగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. తంగేడు కాటా వద్ద అమ్మవారిని గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి దర్శనం చేసుకున్నారు. ఉప సర్పంచ్ ఆర్ఎస్ లక్ష్మీనరసింహరాజు వితరణతో అమ్మవారికి వెండి కిరీటం అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా యువకులు పర్యవేక్షించారు. రహదారిలో ప్రయాణికులకు ప్రసాద వితరణ చేశారు.

ఏటికొప్పాక వేలం పాట.. గందరగోళం

- గతేడాది కంటే రూ.32 వేలు తక్కువకు ఖరారు
- అక్రమాలు జరిగాయంటున్న స్థానికులు

యలమంచిలి రూరల్: మండలంలోని ఏటికొప్పాక మేజర్ పంచాయతీలో వారపు సంత, రోజువారీ మార్కెట్, కబేళా, కార్లు స్టాండు కోసం మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో అధికారులు నిబంధనలకు పాతరేశారు. బహిరంగంగా నిర్వహించాల్సిన వేలం పాటను రహస్యంగా ఒక్కరికే దక్కేలా చేసి గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి కొట్టారు. ఫలితంగా గతేడాది రూ.1.50 లక్షలకు ఖరారైన ఆశీల వసూలు వేలం పాట ఈ సారి రూ.1.18 లక్షలకు మాత్రమే ఖరారు చేశారు. ఈ వేలం పాట గత గురువారం జరగాల్సి ఉండగా, ఐదుగురు వేలంపాటకు హాజరయ్యారు. గ్రామస్తులు కొందరు అభ్యంతరం చెప్పడంతో వేలం పాటను గత శనివారానికి వాయిదా వేశారు. ఆ రోజూ సహేతుకమైన కారణాలు లేకుండా వేలం పాటను మరోసారి వాయిదా వేశారు. తాజాగా నిర్వహించిన బహిరంగ వేలం పాటకు ఇద్దరే హాజరయ్యారు. వీరు కూడా అధికారులు నిర్ణయించిన ధరావతు ఎక్కువగా ఉందని, అంత మొత్తం చెల్లించలేమని చెప్పి వెనుదిరిగారు. వారిని మళ్లీ వెనక్కు పిలిపించుకుని ధరావతు సొమ్ము మొత్తం చెల్లించకపోయినప్పటికీ వేలం పాటలో పాల్గొనేందుకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలంపాట నిర్వహించకుండానే రికార్డుల్లో నిర్వహించినట్టుగా చూపించి ఇద్దర్లో ఒకరికి ఏకపక్షంగా పాటను ఖరారు చేసుకున్నారని గ్రామానికి చెందిన సకినేటి స్వామి శివ సీతారామరాజు సాక్షికి చెప్పారు. బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న విషయాన్ని సరిగ్గా ప్రచారం చేయకపోవడం, నిబంధనలు పాటించకపోవడంతో కొందరు గ్రామస్తులు పాల్గొనలేక పోయామన్నారు. ఈ వేలం పాటను రద్దు చేసి మరోసారి బహిరంగంగా నిర్వహిచాలని కోరారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని కలెక్టరు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు స్పష్టం చేశారు. బహిరంగ వేలం పాట సక్రమంగా నిర్వహించడం వల్ల గ్రామ పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.

60 మంది రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న యువకులు

ఎస్.రాయవరం: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుక పురస్కరించుకుని రేవుపోలవరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమానులతోపాటు యువకులు మొత్తం 60 మంది రక్తదానం చేసి ఇచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. లఫ్ షేర్ బ్లడ్ గ్రూపు ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించి భద్రపరచారు. కార్యక్రమంలో నిర్వాహకులు పల్లేటి దాసు, జగదీష్, చోడిపల్లి లోవరాజు, కంబాల రాజు, ఎరిపల్లి జగదీష్, కారే అమ్మరయ్య, కంబాల అప్పలరాజు, అర్జిర్లు, అనిల్, మైలపల్లి ఎర్రయ్య, వర్మ, మణికంఠ పాల్గొన్నారు.

50 శాతం ఫీజు రాయితీతో విద్య

మాకవరపాలెం : లయన్స్ క్లబ్ నర్సీపట్నం–నవ్య సౌజన్యంతో విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీతో విద్య అందించనున్నట్టు క్లబ్ కార్యదర్శి చైతన్య, అధ్యక్షులు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న మాంటిస్సోరి పాఠశాలను ఎంపిక చేశామన్నారు. ఈ పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 50 శాతం ఫీజు రాయితీలో విద్య అందిస్తామన్నారు. గ్రామీణ ప్రాతంలో ఉన్న పేద విద్యార్థులకు తక్కువ ఫీజులతో విద్య అందించడమే లయన్స్ క్లబ్ లక్ష్యమన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 30 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పరిహారం తేలాకే భూ సర్వే చేయాలి

తహసీల్దార్‌కు రైతుల స్పష్టీకరణ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

రావికమతం : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి బ్యాలెన్స్ రిజర్వాయర్ ఏర్పాటుకు సంబంధించి, సర్వేకు సంబంధించి, రెండో రోజు మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ పైలా రాజు తదితర రైతులతో తోటకూర పాలెం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో పాటు ఎంపీపీ పైల రాజు మాట్లాడుతూ తమకు డీపీఆర్ ఎక్కడ నుంచి ఎక్కడ వరకూ ఎన్ని భూములు తీసుకుంటున్నదీ ముందుగా తెలియజేయాలని ఎంపీపీ పేర్కొన్నారు. గ్రామంలోకి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులతో కలిసి సమీక్షలు నిర్వహించి, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం, ఉపాధికి స్పష్టమైన హామీ ఇవ్వాలని, అప్పుడే తమ భూములు సర్వే చేయడానికి అంగీకరిస్తామని రైతులు తహసీల్దార్‌కు స్పష్టం చేశారు.

'అన్నదాత సుఖీభవ'కు రైతు ఆధార్ 1-బి పత్రాలు ఇవ్వాలి



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు : రైతులకు పంట పెట్టుబడి సహాయం కింద రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన రైతులకు గుర్తించేందుకు రైతు సేవా కేంద్రాల్లో వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతున్నట్టు మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం మండలంలో గల 22 గ్రామ రైతు సేవా కేంద్రాల్లోనూ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని మంగళవారం ఆయన కె.సంతపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ కె.కోటపాడు మండలంలో 22 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ పథకానికి సంబంధించి 19,387 మంది రైతుల వివరాలు వ్యవసాయశాఖ సహాయకుల లాగిన్‌లకు వచ్చినట్టు తెలిపారు. రైతులు వారి ఆధార్, 1–బి పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లో గల వ్యవసాయశాఖ సహాయకులను సంప్రదించాలని తెలిపారు. భూ వివరాలు ఆధార్ నంబర్‌తో జత అయి ఉంటే వెంటనే వారి వివరాలకు వ్యవసాయశాఖ సహాయకులు అప్రూవల్ ఇవ్వనున్నట్టు తెలిపారు. 1–బి వివరాలు, రైతు ఆధార్ అనుసంధానం కాకపోతే మరలా వ్యవసాయశాఖ సహాయకులు రెవెన్యూ అధికారులకు పంపించనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకూ మండలంలో 22 రైతు సేవా కేంద్రాల్లోను 9500 మంది రైతుల వివరాలను అప్రూవల్ చేయడం జరిగిందన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బుచ్చయ్యపేట: స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం వడ్డాది గ్రామ శివారులో పేకాడుతున్న వారిపై ఎస్ఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.18,160 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

నర్సీపట్నం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతీ, యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని కార్య నిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీ వై.జంక్షన్‌కు సమీపంలో ఉచిత భోజనంతో పాటు శిక్షణ ఇస్తామన్నారు. 76 రోజులు శిక్షణ ఉంటుందన్నారు.

జోరు వానలో సీహెచ్‌వోల నిరసన

అనకాపల్లి: జోరు వానను సైతం లెక్కచేయకుండా తమ సమస్యలు పరిష్కరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన చేపట్టారు. స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం ఎదురుగా డీసీఎంఎస్ కార్యాలయం వద్ద చేపట్టిన వీరి నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆఫీసర్స్ జి.భవాని, జి.యమున, బి.సుధాకర్, రేవతి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. గ్రామీణ రోగులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నారని, జిల్లా వ్యాప్తంగా 425 మంది ఉద్యోగులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు లేకుండా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం

- కొత్త రైల్వే ట్రాక్ నిర్మాణంలో 80 మంది భూనిర్వాసితులు
- పార్లుపాలెం రైతుల సమావేశంలో తహసీల్దార్ ఆనంద్ వెల్లడి



పార్లుపాలెంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: గోపాలపట్నం నార్త్ సింహాచలం నుంచి కొత్తవలస వరకు రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కలెక్టర్ వెల్లడించారని పెందుర్తి తహసీల్దార్ ఎం.ఆనంద్ కుమార్ రైతులకు తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేందిరప్రసాద్, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, అధికారుల మధ్య జరిగిన సమావేశంలో పరిహారం అంశం చర్చించారని చెప్పారు. మంగళవారం పార్లుపాలెంలో రైతులతో జరిగిన చర్చలో ఆయా విషయాలను తహసీల్దార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత స్థాయి సమావేశంలో రైల్వే ట్రాక్ సమీపంలో అనుభవం, సాగులో ఉన్న రైతులు దాదాపు 80 మంది వరకు ఉన్నట్లు గుర్తించారన్నారు. భూములు కోల్పోతున్న రైతుల తుది జాబితాను త్వరలో రూపొందిస్తామన్నారు. వచ్చే నెలలో జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. రైతుల సాగులో ఉన్న భూములు సింహాచలం దేవస్థానం పరిధిలో ఉన్నందున దేవస్థానం అధికారులతో కూడా ఉన్నతాధికారులు చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. పరిహారం విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ భరోసా ఇచ్చారు. పలువురు అధికారులు, స్థానిక గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

4న తెలుగు రాష్ట్రాల సినీ గీతాల పోటీలు



కరపత్రాలను విడుదల చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లి టౌన్: గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి సందర్భంగా వచ్చే నెల 4న యలయంచిలి గుర్రప్ప కల్యాణ మండపంలో ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ గీతాల పోటీలను నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు మత్తుర్తి రామారావు తెలిపారు. పట్టణంలోని మంగళవారం ఆయన పాటల పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనే వారికి వయసుతో సంబంధం లేదన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు స్త్రీ, పురుషులందరూ పాల్గొనవచ్చని, ప్రవేశ రుసుంగా రూ.100 చెల్లించాలన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక నగదు అందజేస్తామన్నా రు. కార్యక్రమంలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం, డాక్టర్ సిహెచ్ ఎస్. అపర్ణ, బెన్నాభత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.